హర.. హరా.. కష్టాలు కనరా!



- ☛ కాళేశ్వరం-మహదేవపూర్ జాతీయ రహదారి విస్తరణలో జాప్యం
- ☛ ప్రధాని శంకుస్థాపన చేసి రెండేళ్లు


విస్తరణ జరగాల్సిన జాతీయ రహదారి ఇదే..

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి-న్యూస్‌టుడే, కాళేశ్వరం

జిల్లాలోని 353సీ జాతీయ రహదారి తెలంగాణ-మహారాష్ట్రలను కలుపుతుంది. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి కూడా సులువైన రాకపోకలకు ఇదే ప్రధానం.. కాళేశ్వరం వద్ద గోదావరిపై అంతరాష్ట్ర వంతెన నిర్మాణంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా మెరుగుపడింది.. ఇదే జాతీయ రహదారిలో కాళేశ్వరం-మహదేవపూర్ మధ్య మాత్రం రహదారి విస్తరణకు నోచుకోక.. వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం నుంచి మొదలై ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ వరకు ఉంటుంది. దాదాపు 101 కి.మీ సాగుతుంది. గుడెప్పాడ్ నుంచి మహదేవపూర్ వరకు విస్తరణ పనులు మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. కానీ, కాళేశ్వరం-మహదేవపూర్ మధ్య 17 కి.మీ మేర పెండింగ్‌లో ఉన్నాయి. ఏళ్లుగా కాలయాపన జరుగుతోంది. 2022 నవంబర్ 12వ తేదీన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభించారు. అదేరోజున అక్కడే రూ.163 కోట్లు నిధులతో నిర్మించతలపెట్టిన కాళేశ్వరం-మహదేవపూర్ రహదారికి ప్రధాని శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్నా పనులు ప్రారంభం కాలేదు.

తాత్కాలిక మరమ్మతులతో సరి

మహదేవపూర్-కాళేశ్వరం గోదావరి వంతెన వరకు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. మార్గంమధ్యలోని కుదురుపల్లి వద్ద వంతెన వర్షాలకు దెబ్బతిని ప్రమాదభరితంగా మారింది. కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తారు.. అలాగే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి.

విస్తరణ కుదింపు

ఈ ప్రాంతంలో ముందుగా జాతీయ రహదారి 22 మీటర్ల వరకు విస్తరించాలని నిర్ణయించారు. కానీ పెద్ద సంఖ్యలో చెట్లు కోల్పోవాల్సి వస్తుందని.. 16 మీటర్ల వరకే రహదారి నిర్మించాలని అటవీశాఖ నిర్ణయం తీసుకుంది. విస్తరణలో కోల్పోనున్న చెట్లను లెక్కించేందుకు నంబర్లు కూడా వేశారు. దాదాపు 7800 చెట్లు కోల్పోతున్నట్లు అంచనా.. వాటికి పరిహారం కూడా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే 25 హెక్టార్ల స్థలాన్ని అటవీ శాఖకు అప్పగించేందుకు చిట్యాల, రేగొండ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించినట్లు సమాచారం.


కుదురుపల్లి వద్ద వంతెన వద్ద ఇరుకు రహదారి, వాహనదారుల ఇబ్బందులు..

విస్తరణ ప్రక్రియ వేగవంతం చేశాం

- మనోహర్, ఈఈ

జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేశాం. అటవీ శాఖకు సంబంధించిన భూసేకరణ, చెట్ల లెక్కింపు, తదితర పనులు పూర్తయినట్లే. ఉన్నతాధికారులు కూడా త్వరగా ప్రారంభించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమస్యలను పరిష్కరించుకుంటూ, రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నాం.


రహదారి కింద కోల్పోయే చెట్లను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ఆ 2 కి.మీపై స్పష్టత ఏదీ?

కాళేశ్వరం శివారు నుంచి గోదావరి వంతెన వరకు దాదాపు 2 కి.మీ రహదారి విస్తరణకు భూ సేకరణ సమస్యగా మారుతోంది. మూడుచోట్ల ప్రతిపాదన చేసినా స్థానికులు, రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పాతమార్గంలో, విద్యుత్తు ఉపకేంద్రం సమీపం నుంచి రెండు మార్గాలను ప్రతిపాదించినా ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికైనా భూసేకరణ, అటవీ అనుమతులు పూర్తిచేసి పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కళతప్పిన.. పారిశ్రామిక శిక్షణ

భూపాలపల్లి, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సీటు పొందాలంటే ఎంతో శ్రమించాల్సి వచ్చేది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి సైతం పోటీ ఉండేది. కొంత మంది సిఫార్సుతో సీటు దక్కించుకునే పరిస్థితులు ఉండేవి. అలాంటిది ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. విడతల వారీగా ప్రకటనలు జారీ చేసినా ఎవరూ ముందుకు రావడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులు అమలు చేయకపోవడం, కావాల్సిన సామగ్రి లేకపోవడంతో చదువులు నామమాత్రంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో నైపుణ్య శిక్షకు పెద్దపీట వేస్తున్నామని, కొత్తగా తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కొత్త కోర్సులు లేక, సిబ్బంది కొరత, కళాశాలలకు నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. భూపాలపల్లి, కాటారంలో రెండు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నా అందులో విద్యార్థులు అంతంత మాత్రంగానే చేరారు.


కాటారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల

నామమాత్రంగా..

ఉద్యోగ అవకాశాలు ఉండటంతో చాలా మంది ఐటీఐలో చేరేందుకు ఆసక్తి కనబర్చేవారు. శిక్షణ అనంతరం కొందరు ప్రభుత్వ, ప్రైవేటులో ఉద్యోగం సాధించేవారు. మరికొందరు స్వయం ఉపాధి పొందేవారు. ప్రస్తుతం కళాశాలల్లో కేవలం పాఠ్యాంశ బోధనకే పరిమితం కావడంతో శిక్షణ నామమాత్రంగా సాగుతోంది. శిక్షణకు కావాల్సిన సామగ్రికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

❐ కళాశాలల్లో చేరితే కేవలం ధ్రువపత్రం తీసుకోవడమే తప్ప ఎలాంటి శిక్షణ ఇవ్వడం లేదనే భావనలో విద్యార్థులున్నారు. కాటారంలో ల్యాబ్ గదులు సక్రమంగా తెరవడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. సిబ్బంది కొరతతో బోధన చేపట్టడం లేదు.

జిల్లా కేంద్రంలో రెండు కోర్సులు..

జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీ ప్రాంతం ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు గతేడాది సొంత భవనం కేటాయించారు. పదేళ్ల క్రితమే రూ.3 కోట్లతో నిర్మించిన భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడంతో కళాశాలను హన్మాన్‌నగర్‌లోని ఓ ప్రైవేటు భవనంలో కొనసాగించారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక, గదులు సరిపోక రెండు కోర్సులకే పరిమితం చేశారు. ప్రభుత్వం 6 కోర్సులను మంజూరు చేసిన ప్రస్తుతం ఫిట్టర్, కోపా మాత్రమే ఉన్నాయి. ఈ రెండు కోర్సుల్లో 88 సీట్లకు గాను కోపాలో 28 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాటారం ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోపా, సివిల్ నడుస్తున్నాయి. పక్కా భవనం లేక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని అదనపు తరగతి గదుల్లో కళాశాలను కొనసాగిస్తున్నారు. ల్యాబ్ సామగ్రిని ఓ గదిలో నిల్వచేశారు. ఇందులో 4 కోర్సులకు గాను మొత్తం వంద సీట్లలో 80 భర్తీ అయినట్లు ఐటీఐ సిబ్బంది ద్వారా తెలిసింది.

నైపుణ్యం పెంచడానికి చర్యలు

జుమ్లానాయక్, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపల్



పాత కోర్సులతో పాటు ప్రస్తుతం కొత్త కోర్సులు ఏర్పాటు చేస్తేనే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఐటీఐలో చేరేందుకు ఆసక్తి చూపిస్తారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి యంత్ర సామగ్రిని ఉన్నతీకరించాల్సిన అవసరం ఉంది. సిబ్బంది కొరత తీర్చడానికి, నైపుణ్యం పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

పడిపోతున్న మక్కల ధరలు!


బస్తాలను తూకం వేస్తున్న కూలీలు

ఎనుమాముల మార్కెట్‌లో మక్కల ధరలు క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ నెల 12న మక్కలకు క్వింటా 3,070 ధర రావడంతో ఈసారి పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతుంది. మంగళవారం క్వింటాకు రూ.2,590 పలకడంతో.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో తేమ సాకుతో రోజుల వ్యవధిలోనే క్వింటాపై రూ.వందల్లో కోత విధించడంపై మార్కెట్ అధికారులు దృష్టి సారించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్త పత్తి ధరలు తగ్గుతుండటంతో.. రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం క్వింటా కొత్త పత్తికి రూ.7,510 పలకగా.. మంగళవారం క్వింటా 7,225 ధర పలికింది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

తాగునీటి సమస్య రాకుండా చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, అదనపు పైపులైన్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. రేగొండ మండలం చిన్నకోడేపాక గ్రామం నుంచి రాజక్కపల్లి వరకు తాగునీటి పైపులైన్ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రేగొండ మండలంలో లోలెవల్ వంతెనలు మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గంలో అసంపూర్తి తాగునీటి పైపులైన్‌ల నిర్మాణాలు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాల్వల పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్మాణ పనులు త్వరితగతిన, నాణ్యతగా చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

మండల విద్యాధికారుల నియామకం

మహదేవపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలకు విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, మండలాలకు మండల విద్యాధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. మండలాల్లోని సీనియర్ ఉపాధ్యాయులు, మండల నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్న వారిని ఇన్‌ఛార్జి విద్యాధికారులుగా నియమించింది. భూపాలపల్లి-ఎం.దేవనాయక్, చిట్యాల-కె.రఘుపతి, మొగుళ్లపల్లి-ఎల్.కుమార్ స్వామి, కాటారం-ఐ.శ్రీదేవి, టేకుమట్ల- సి.సుధాకర్, రేగొండ-వి.ప్రభాకర్, మల్హర్-జి.లక్ష్మణ్‌బాబు, మహాముత్తారం-పి.సంజీవరెడ్డి, మహదేవపూర్-డి.శంకరయ్య, పలిమెల-కె.వెంకటరాజంలను ఎంఈవోలుగా నియమించారు.

ఆదమరిస్తే బోర్లా పడాల్సిందే..



మండల కేంద్రం నుంచి మహదేవపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పంకెన శివారులో తీగల వాగు వంతెనపై భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇదే గుంతలో రెండు రోజుల క్రితం పలిమెలకు చెందిన కొత్త కుమ్మరి వినోద్ పంకెన నుంచి పలిమెలకు రాత్రి సమయంలో ప్రయాణిస్తూ అదుపుతప్పి గాయపడ్డాడు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని మండలవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సైలే కీలకం


ఎస్పీ కిరణ్‌ఖరేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న శిక్షణ ఎస్సైలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : సమాజంలో పోలీసు ఉద్యోగుల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్ఐలు కీలకపాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే దిశానిర్దేశం చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శిక్షణ ఎస్సైలకు జిల్లాలోని 11 పోలీసుస్టేషన్‌లలో పనిచేసేందుకు ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో ప్రత్యేకత చాటుతూ, అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా భద్రత, నేరాలు, దొంగతనాలు అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణ పోలీసుల లక్ష్యమని, జిల్లాలో మత్తుపదార్థాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉద్యోగంలో ఎన్నో కఠిన పరిస్థితులు, సవాళ్లు ఉంటాయని, వాటన్నింటినీ సమర్థంగా ఎదుర్కోవాలని పేర్కొన్నారు.

కోడి కూయక ముందే..

మద్యం జోరు!



రహదారులపైనే తాగుతూ.. ఊగుతూ...!

వరంగల్ క్రైం, భూపాలపల్లి, కాటారం, మహాముత్తారం న్యూస్‌టుడే

ఒకప్పుడు పండగకో.. పబ్బానికో మద్యం తాగేవారికి.. ఇప్పుడు సమయం.. సందర్భం అవసరం లేదనిపిస్తోంది. ఎప్పుడు పడితే.. అప్పుడే.. ఎక్కడపడితే అక్కడే.. అది అందుబాటులో ఉండడంతో.. చాలామంది దానికి బానిసలవుతున్నారు. మద్యం దుకాణాలకు తోడు గల్లీకో బెల్టుషాపు దర్శనమిస్తోంది. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో కోడి కూయక ముందే ప్రారంభమై రాత్రి ఒంటిగంట వరకు బార్లు డోర్లు తెరుచుకుని ఉంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం 'న్యూస్‌టుడే బృందం' నిర్వహించిన పరిశీలనలో సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, పలువురు రహదారుల పక్కనే కూర్చొని మద్యం తాగుతూ కనిపించారు.

మీకు తెలుసా..

'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019-22 ప్రకారం.. దేశంలో అత్యధికంగా తాగుడు అలవాటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.. రాష్ట్రంలో 43 శాతం మందికి మద్యం తాగే అలవాటున్నట్లు వెల్లడైంది. మరోవైపు మద్యానికి బానిసై.. డీఅడిక్షన్ కేంద్రాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.'

ఇవీ నిబంధనలు..

- మద్యం దుకాణాలు (వైన్స్) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉండాలి. బార్లు 11 వరకు అనుమతి ఉంటుంది.
- ప్రతి దుకాణానికి ప్రభుత్వం మద్యం తగడానికి గది అనుమతి ఇస్తుంది. అది లేనప్పుడు దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకొని వెళ్లాలి.
- వైన్స్ ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుండాలి.
- 21 ఏళ్ల లోపువారికి మద్యం అమ్మొద్దు.
- మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మొద్దు.
- జాతీయ రహదారులకు 225 మీటర్లలోపు మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు. గుడి, బడికి 100 మీటర్లలోపు ఉండొద్దు.
- మద్యం కల్తీ జరగకుండా పర్యవేక్షణ తప్పనిసరి.

ఇదీ పరిస్థితి..

- సాయంత్రం మద్యం దుకాణాలు జాతరను తలపిస్తున్నాయి. రహదారికి ఆనుకుని ఉన్నచోటవాహదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- రాత్రి 10 తర్వాత మద్యం విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాన్ని తెరిచి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలకు సైతం అమ్ముతున్నారు.
- ప్రత్యేక సాకులు చూపి రహదారులపైనే నిర్వహిస్తున్నారు.
- మద్యం దుకాణాల వద్ద ఆహార పదార్థాలు, తినుబండారాలు అమ్మకూడదు. అధికారులు ఇవేవి పట్టించుకోరు.
- అనేక చోట్ల రోడ్డు వెంట ఉన్న మద్యం దుకాణాలతో సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- ఇష్టారీతిన అమ్మకాలు చేస్తున్నారు. క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిల్‌కు రూ.30, 50, 100 చొప్పున అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారు.


మహాముత్తారం : యామన్‌పల్లిలో పర్మిట్ రూంలో సౌకర్యాలు లేకపోవడంతో మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం తాగుతున్నారు.


భూపాలపల్లి : సుభాష్‌కాలనీలోని మద్యం దుకాణం ఇళ్ల మధ్యలోనే కొనసాగుతోంది.. సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు ఆ వీధిలో మద్యం ప్రియుల చేష్టలతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.

కళాశాల ఆవరణలో..

రాయపర్తి: రాయపర్తి మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు 170 మీటర్ల దూరంలో వైన్స్ ఏర్పాటు చేశారు. మందుబాబులు రాత్రి వేళల్లో కళాశాలకు వెళ్లే రహదారి, కళాశాలలో నిత్యం మద్యం తాగి సీసాలతో పాటు వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు.

గుడి వెనకాలే 'బార్ అండ్ రెస్టారెంట్'

మట్టెవాడ: వరంగల్‌లోని ప్రధాన కూడలిలో గోపాలస్వామి గుడి కూడలి ఒకటి. పోచమ్మమైదాన్ నుంచి ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లే మార్గంలో త్రిశక్తిపీఠం దేవాలయం ఉంది. ఈ దేవాలయానికి అత్యంత సమీపంలో మద్యం దుకాణాలున్నాయి.


కాటారం : మంథని ప్రధాన రహదారి పక్కన మద్యం దుకాణం వెనకాల పర్మిట్ రూం ఉన్నా ఇష్టారాజ్యంగా దుకాణం ముందే బహిరంగంగా తాగుతున్నారు. మహిళలు, పిల్లలకు ఇబ్బందికరంగా మారింది.

కాళేశ్వరంలో ఉన్నతాధికారుల ప్రత్యేక పూజలు


ముఖ్యకార్యదర్శి, పాలనాధికారి, సబ్ కలెక్టర్‌కు ఆశీర్వచనం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర క్షేత్రంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, పాలనాధికారి రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి క్షేత్రస్థాయిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం రాగా ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ఈవో మారుతి ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ద్విలింగాలకు జలాభిషేకాలు నిర్వహించారు. పార్వతీ ఆలయంలో అర్చకులు ఆశీర్వచనం చేశారు. అర్చకుల సమస్యలను ముఖ్య కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి అర్చకుల సంఖ్య తక్కువగా ఉందని, గతంలో నోటిఫికేషన్ వెలువడినా నియామకం జరగలేదని ముఖ్య అర్చకులు ఫణీంద్రశర్మ ఆమెకు వివరించారు. కాళేశ్వర క్షేత్రంలో వృథాగా పడి ఉన్న పూర్వం నాటి శిలాసంపదతో పాటు పూర్వం నాటి సరస్వతీ విగ్రహం ఒక వేదికపై ఏర్పాటు చేయాలని శైలజరామయ్యర్ ఈవో మారుతికి సూచించారు. భిన్నమైన శిల్ప సంపదను భావితరాలు తిలకించేలా ఒకే వేదిక మీద ఏర్పాటు చేసి వాటి పేర్లు, ప్రాముఖ్యత లిఖించాలని ఆమె సూచించారు.

కాటారం: ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు సతీమణి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్ ప్రత్యేక పూజలు చేశారు. సమాచార పౌర సంబంధాల, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావుతో కలిసి ఆలయంలో మొక్కులు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కృష్ణమోహన్‌శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి సన్మానించారు.

కల్తీ ముప్పు.. కనిపెడితేనే మేలు..!



'తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ తయారీలో జరిగిన తప్పిదాలపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న నేపథ్యంలో కల్తీపై అంతటా చర్చ జరుగుతోంది. ఆ బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంలోనే కాదు మన నిత్య జీవితంలో వాడే ఆహారపదార్థాల్లోనూ కల్తీ జరుగుతోంది. దీన్ని గుర్తించి జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనదే'



ప్రస్తుతం కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా రోజులు మారాయి. విపణిలో కల్తీ ఆహార పదార్థాలు రాజ్యమేలుతున్నాయి. మనం చూసే ప్రతిదీ అందంగా ఆకర్షించేలా కనిపిస్తున్నా లోపల మాత్రం ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు జోడించి తయారు చేసిన ఉత్పత్తులుంటున్నాయి. నిత్యం ఆరోగ్య రక్షణకు వినియోగించే సర్వరోగ నివారిణి తేనె, తాగే పాలు మొదలు వంటకాల్లో వాడే నూనె, కారం, పసుపు నుంచి మసాల వరకు కల్తీ బారిన పడినవే. వాటిని తింటూ వ్యాధులను కొనితెచ్చుకుంటున్నాం. ఈ నేపథ్యంలో పదార్థాల నాణ్యత తనిఖీ చేయడం అవసరం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన పద్ధతి ప్రకారం ఇంట్లోనే కల్తీని గుర్తించే విధానంపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్

పాలు



● **కల్తీ చేసే పదార్థాలు:** స్టార్చ్ (పిండి పదార్థాలు), డిటర్జెంట్ పౌడర్

● **గుర్తించే విధానం:** 5-10 ఎం.ఎల్., పాలు తీసుకుని వాటికి సమానమైన నీటితో బాగా కలపాలి. డిటర్జెంట్ కలిసి ఉంటే చిక్కని నురగ వస్తుంది. స్వచ్ఛమైన పాలు అయితే సన్నని నురగ పొర ఏర్పడుతుంది.

పాలను వేడి చేసి అందులో కొన్ని చుక్కల అయోడిన్ వేస్తే అవి నీలం రంగుగా మారితే స్టార్చ్ (పిండిపదార్థాలు)లతో కల్తీ చేసినట్లే.

తేనె



● చక్కెర ద్రావణం

● స్వచ్ఛమైన తేనెకు మండే స్వభావం ఉంటుంది. నాణ్యమైన తేనెలో పత్తిని ముంచి మండిస్తే మండుతుంది. ● ట్రాన్సపరెంట్ గ్లాసు పాత్రలో నీళ్లు తీసుకోవాలి. అందులో కొద్దిగా తేనె వేస్తే అది విడిపోతే అందులో చక్కెర ఉన్నట్లు గుర్తించాలి. ● గిన్నెలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా తేనెను వేసి వేడి చేయాలి. అప్పుడు చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తే చక్కెర కలిపినట్లు. కల్తీ జరగకుంటే ఎలాంటి శబ్దం రాదు. ● ఒక గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకొని అందులో ఒక చెంచా తేనె కలిపి కాస్త వెనిగర్ వేయాలి. నురగ వస్తే అది కల్తీ అయినట్లు.

కారం



● ఇటుక పొడి, సింథటిక్ కలర్

● గాజు గ్లాసులో నీటిని తీసుకుని అందులో మిరపపొడిని వేయాలి. ఇటుక పొడి ఉంటే అది నీటి అడుగుభాగానికి చేరుతుంది. గాజు పాత్రలో నీటిపై కారం పొడిని వేస్తే కృత్రిమ (సింథటిక్) రంగు చారల రూపంలో కిందికి దిగుతుంది.

నల్ల మిరియాలు



● బొప్పాయి గింజలు

● ఒక గ్లాసు నీటిలో కొంత మొత్తంలో నల్ల మిరియాలు వేయాలి. స్వచ్ఛమైనవి అడుగు భాగానికి చేరుకుంటాయి. బొప్పాయి గింజలు నీటిపై తేలుతాయి.

కాకరకాయ, పచ్చిమిర్చి, ఇతర ఆకుకూరలు



● ఆకర్షించేలా కృత్రిమ రంగు పూయడం

● నీటిలో, వెజిటబుల్ ఆయిల్‌లో ముంచిన పత్తి దూదిని తీసుకోవాలి. దాన్ని కూరగాయలపైన రుద్దాలి. దూది ఆకుపచ్చగా మారితే వాటిని కృత్రిమ రంగుతో కల్తీ చేసినట్లు.

నెయ్యి



● పిండిపదార్థం

● గాజు గ్లాసులో కొద్దిగా నెయ్యిని తీసుకొని అయోడిన్ ద్రావణాన్ని కలపాలి. నీలంరంగులోకి మారితే పిండి పదార్థాలతో కల్తీ చేసినట్లు.

ఒక చెంచా నెయ్యిని ఒక గ్లాసు నీటిలో కలిపితే స్వచ్ఛమైన నెయ్యి ఉపరితలంపై తేలుతుంది. నీటిలో కలిసినా, దిగువకు చేరితే అది నూనెలతో కల్తీ కావొచ్చని అర్థం.

పసుపు



● మెటానిల్ ఎల్లో, సన్‌సెట్ ఎల్లో, బియ్యం పిండి

● పరీక్ష నాళికలో కొద్దిగా పసుపు పొడిని తీసుకొని నీటిని కలపాలి. గాఢమైన పసుపు రంగు ఏర్పడితే కల్తీ జరిగినట్లు. బియ్యం పిండి ఉంటే నీటి అడుగులోకి చేరుతుంది.

కంది, పెసర పప్పు



● కేసరి పప్పు, మెటానిల్ ఎల్లో రంగు, టెట్రాజయిన్

● కేసరి పప్పు పలుకులుగా ఉంటుంది. దీన్ని భూతద్దం సహాయంతో గుర్తించొచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా కంది/పెసర పప్పును తీసుకొని కొద్దిగా నీటిని కలిపి దానికి 5మి.లీ. గాఢ హైడ్రోక్లోరికామ్లం కలిపి 10 నిమిషాల తర్వాత పరిశీలిస్తే గులాబీ రంగులో మారితే కల్తీ జరిగినట్లు.

టీ/కాఫీ పొడి



● ఇనుప పొడి, కృత్రిమ రంగులు, చింతగింజల పొడి

● టీపొడిని కొద్దిగా తెల్లని కాగితంపై పలచగా పోసి దాంట్లో అయస్కాంతాన్ని తిప్పితే ఇనుప పొడి దానికి అతుక్కుంటుంది. ● చల్లని నీటిలో టీపొడిని కలిపితే 30 సెకన్లలోనే నీటి రంగు మారితే అది కల్తీ అయినట్లు.

● కాఫీ పొడిని చల్లని నీటిలో బాగా కలిపాలి. కాఫీ పొడి నీటిపై తేలి చింతగింజల పొడి ఉంటే అడుగు భాగానికి చేరి నీటిని మట్టి రంగులోకి మారుస్తుంది.

అనారోగ్య సమస్యలివే..



కల్తీ ఆహార ఉత్పత్తులను తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, పక్షవాతం, క్యాన్సర్, కంటి వ్యాధులు సంభవిస్తాయి. గుండె, ఊరిపితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.



– డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, ఎండీ ఫిజిషియన్

వేరుశనగ, నువ్వుల నూనె



● సోయాబిన్, ఆర్జిమోజన్ నూనె

● ఒక పరీక్షనాళికలో కొద్దిగా నూనె, 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లం, కొద్దిగా పంచదార కలిపాలి. పరీక్ష నాళిక దిగువన గులాబీ, ఎరుపు రంగు ఏర్పడితే నూనెలు కల్తీ అయినట్లు.

కొబ్బరి నూనె



● మినరల్ ఆయిల్, పామ్ కెర్నల్

● శుద్ధమైన కొబ్బరి నూనెను ఫ్రిజ్‌లో పెట్టి అరగంట తర్వాత చూస్తే పూర్తిగా గడ్డకడుతుంది. సగం గడ్డకట్టి.. సగం కట్టకుంటే కల్తీ అయినట్లు.

ఇవి కూడా..



● అందరూ ఎంతో ఇష్టంగా తినే మిఠాయిల్లో రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. 100 పీపీఎం కంటే ఎక్కువగా కలిపిన మిఠాయిలను తింటే అనారోగ్యానికి దారి తీస్తాయి.

ఇటీవల వరంగల్ జిల్లాలో ఒక మిఠాయి దుకాణంలో ఆహార భద్రతా అధికారులు వాటిని గుర్తించి జరిమానా విధించారు.

● కొబ్బరి పొడిలోనూ నాణ్యత లేనిది ఉంటుంది. కొబ్బరిపొడిలో 55శాతం నూనె ఉండాలి. లేకుంటే నాణ్యత లేనట్లు.

హనుమకొండలో 45 శాతం నూనె ఉన్న ఒక కంపెనీకి చెందిన కొబ్బరి పొడిని స్వాధీనం చేసుకున్నారు.



వారసంతల్లో ఎక్కువగా..

ఇది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని వారసంత. ప్రతి మంగళవారం నిర్వహిస్తారు. వంటింట్లోకి అవసరమైన అన్ని సరకులను ఇలా పెట్టి విక్రయిస్తారు. ఇక్కడ కల్తీ ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. పసుపు, పప్పులు, ఉల్లిగడ్డలు, సుగంధ ద్రవ్యాలు ఇలా ప్రతిదీ నాణ్యత లినివే ఉంటాయి. ఈ విషయం తెలియని చుట్టుపక్కల గ్రామాలు, తండాల్లోంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఇలా చేద్దాం

కారం పొడిని రైతుల వద్ద, ఎండు మిర్చి విక్రయాలు చేసే దుకాణాల వద్ద ఏడాదికి సరిపడా కొనుగోలు చేసి మరాడించుకుని భద్రపరుచుకుంటే చాలు. కల్తీ కారం నుంచి బయటపడొచ్చు. ఇలా కాకుండా ప్యాకెట్లలోని కారం కొనుగోలు చేయాలనుకుంటే ఆహార పరిరక్షణ ప్రమాణాల ప్రకారం ఉందా లేదా చెక్ చేసుకుని కొనాలి.

● గేదెలు సాకుతూ పాలను పట్టణాల్లోకి తీసుకొచ్చి విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయాలి. గ్రామాల్లో ఆవులు, గేదెలను పోషిస్తూ వాటి పాల ద్వారా నెయ్యిని తీసి విక్రయాలు చేస్తారు. వారి వద్ద నాణ్యమైంది లభిస్తుంది.. దానికి ధర అధికంగా ఉన్నా కొనుగోలు చేయడం ఉత్తమం.

● పసుపు సాగు చేసే కొందరు రైతులు దాన్ని ఉడికించిన తర్వాత పసుపు పొడిగా మరాడించి విక్రయాలు చేస్తారు. వారి వద్ద కొంటే కల్తీ బారి నుంచి తప్పించుకోవచ్చు.

● తేనె రోడ్లపక్కన పెట్టి విక్రయాలు చేసే వారి వద్ద కొనుగోలు చెయ్యొద్దు. గ్రామాలు, ఏజెన్సీ గూడేలు, తండాల్లో చెట్లకు ఉన్న తుట్టెల ద్వారా సేకరించిన తేనెను గానీ, తేనెటీగల పెంపకం చేపడుతూ తేనె విక్రయించే వారి వద్ద తీసుకోవాలి. కొన్ని అధీకృత కంపెనీల వారు మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. వాటిని కూడా కొనుగోలు చెయ్యొచ్చు.

'దోచుకోవడం, దాచుకోవడం తప్ప భారాస చేసిందేమీ లేదు'



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత పదేళ్లలో భారాస ప్రభుత్వం రూ. లక్షల కోట్ల అప్పులు చేసిందని, తీవ్ర ఆర్థిక లోటు ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీలేదని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాల్లో అయిదు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. భారాస ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం నాలుగైదు కార్పొరేటు ఆసుపత్రులకు మాత్రమే ఎల్వోసీలు ఇచ్చారన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, విద్య, వైద్యం, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక



ప్రముఖుల ఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్.. చిత్రంలో పాలనాధికారి రాహుల్ శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్ర మలివిడత అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది.. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలపైనా దృష్టి సారించారు. కాళేశ్వర క్షేత్ర సన్నిధిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులతో క్షేత్ర అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్మాణాలు ఎంతమేరకు పూర్తి కావచ్చాయి..? మిగతా నిర్మాణాల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈవో మారుతిని ప్రశ్నించారు. సత్వరమే నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. రాబోయే సరస్వతీ పుష్కరాలకు ఏవిధంగా ప్రణాళిక చేస్తే బాగుంటుందని అధికారుల వద్ద సలహాలు తీసుకున్నారు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులను పలు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద బృందావన్ గార్డెన్ మాదిరి పర్యాటక ప్రాంతం అవసరమని, చిన్న మ్యూజియం ఏర్పాటు చేస్తే సందర్శకులు, చిన్నారి విద్యార్థులకు గొప్ప అనుభూతి కలిగిస్తుందని పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి సూచించారు. బృహత్తర ప్రణాళిక అమలుకు ముందు ఆలయ నిర్మాణాల తీరుపై శృంగేరి పీఠం వారికి వివరించాలని దేవాదాయశాఖ స్థపతి వల్లీ నాయగం సూచించారు. రూ.115 కోట్లతో కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జీఎం వివరించారు. గోదావరి తీర ప్రాంతం అపరిశుభ్రతకు తావులేకుండా పవిత్రతకు మారుపేరులా ఉండాలని శైలజారామయ్యర్ ఆదేశించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం అతిథిగృహాలు అస్తికలు నిమజ్జనం చేసే భక్తులకు ఆలయ సిబ్బంది ఇవ్వడం లేదని కాళేశ్వరాలయం మాజీ ఛైర్మన్ కోటరాజబాపు, మాజీ ధర్మకర్త అశోక్ ఆమె దృష్టికి తీసుకురాగా ఈవోపై మండిపడ్డారు. క్షేత్ర ఆవరణలో భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ టాయిలెట్స్ నిర్మాణాలు జరగాలని ఆదేశించారు.

నిజాయతీతో సేవలందిస్తే గుర్తింపు



సీపీని కలిసిన ఎస్సైలు అభ్యర్థులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రజలకు నీతి, నిజాయతీతో సేవలందిస్తే మంచి గుర్తింపు ఉంటుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన శిక్షణ పొందిన 19 మంది ఎస్సైలు మంగళవారం కమిషనరేట్‌లో సీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. చట్టం పరిధిలో సేవలు అందిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలన్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు



మల్లకపల్లి శివారులో మొరం కోసం వచ్చిన వాహనాలు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ధర్మసాగర్ మండలం మల్లకపల్లి నుంచి రాంపూర్‌కు వెళ్లే దారిలో గుట్టల నుంచి మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఏడాదికి పైగా గుట్టలను కొల్లగొడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు ప్రకృతి సంపదను దోచుకుంటున్నా అధికారులు ఎవరూ స్పందించడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఊర చెరువు సమీపంలోని క్వారీ నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాంపూర్ మీదుగా హనుమకొండ, వరంగల్ నగర శివార్లలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదే రహదారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే మల్లకపల్లి రైతులు, పనులకు వెళ్లే కూలీలు నిత్యం తిరిగే వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక బరువుతో భారీ వాహనాలు తిరగడం ద్వారా రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం రాయల్టీ నష్టపోతున్నా, రోడ్లు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుకున్న ఎండు గంజాయితో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుషకుమార్, సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే: రెండు కార్లలో తరలిస్తున్న 187 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన రాహుల్ మంజుదార్ (22), రాయపూర్‌కు చెందిన హరీష్ యాదవ్ (24), ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరికి చెందిన మండల నరేష్ (32)లతో ఎండు గంజాయిని ఒడిశా నుంచి భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్, గూడూరు మీదుగా హైదరాబాద్ తరలించేందుకు ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరి జిల్లాకు చెందిన బాపన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. రాహుల్ మంజుదార్, హరీష్ యాదవ్, మండల నరేష్ ఒడిశా నుంచి రెండు కార్లలో హైదరాబాద్ బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మండలంలోని మచ్చర్ల గ్రామం స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వస్తున్న రెండు కార్లను ఆపి సోదా చేయగా సుమారు రూ.46.76 లక్షల విలువైన 187.04 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చేసుకొని రాహుల్ మంజుదార్, మండల నరేష్, హరీష్ యాదవ్, బాపన్‌లపై కేసు నమోదు చేసి రెండు కార్లు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు.

'ఐటీఐ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చందర్ తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో 5వ విడత ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 83741 01790లో సంప్రదించాలన్నారు.

ఎనుమామూలు పనులు

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏడాది క్రితం రూ.17.07 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు అటకెక్కాయి. గతేడాది ఆగస్టు 16న అప్పటి పాలకవర్గం గడువు ముగిసే రెండు రోజుల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణ పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక.. మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో.. నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. మరోవైపు పనులకు సంబంధించి అప్పటి పాలకవర్గానికి, మార్కెట్ అధికారులకూ కమీషన్లు అందినట్లు ఆరోపణలున్నాయి. అందుకే తమ హయాంలోనే పనులు ప్రారంభించాలని.. వేగిరపడినట్లు తెలుస్తోంది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్



అపరాల యార్డులో కమీషన్ దుకాణాల నిర్మాణాల పనులను మధ్యలోనే నిలిపేసిన గుత్తేదారు

● ధాన్యం, అపరాల యార్డులో ఉప కార్యాలయం నిర్మాణం	● 47	● 22.22
● మిర్చి యార్డులోని ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	● 444	● 191
● పసుపు, పల్లికాయ యార్డులో ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	● 293	● 64.77
● మార్కెట్ రెండో గేట్ వద్ద కళాతోరణం నిర్మాణం	● 29	● 26.22
● మార్కెట్ రెండో గేట్ వద్ద ఎడ్లబండ్లు, రైతుల ప్రతిమలు ఏర్పాటు	● 9.20	● 8.50
● ధాన్యం, అపరాల యార్డులో 24×12 వైశాల్యంతో కొత్తగా 40 దుకాణాల నిర్మాణం	● 420	● 73.01
● పత్తియార్డు కార్యాలయ మరమ్మతు పనులకు	● 17	● 0
● పత్తియార్డు చుట్టుపక్కల ఉన్న డివైడర్లకు, బారికేడ్లకు సింథటిక్ పెయింటింగ్ పనులకు	● 10	● 0
● మార్కెట్ చుట్టూ ప్రహరీ పనులకు	● 20	● 0
● లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ప్రాంతీయ, జిల్లాస్థాయి మార్కెటింగ్ అధికారుల భవన సముదాయ నిర్మాణం	● 418	● 76.32

● అభివృద్ధి పనులు ● కేటాయించిన నిధులు(రూ.లక్షల్లో) ● ఇప్పటివరకు ఖర్చు (రూ.లక్షల్లో)

రూ.కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కారణంగా.. ఫీజు రూపంలో మార్కెట్‌కు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. గతేడాది ఫీజు రూపంలో రూ.43.39 కోట్ల ఆదాయం సమకూరగా.. ఈ ఏడాది రూ.56 కోట్ల ఆదాయాన్ని సాధించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్ అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాలు లేక మార్కెట్‌లోని యార్డులు చీకటిగా ఉంటున్నాయి. పత్తి, మిర్చి సీజన్లలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతు విశ్రాంతి భవనంలో మౌలిక సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాథమిక వైద్యశాలకు పూర్తిస్థాయిలో వైద్యపరికరాలు, మందులు సమకూర్చేందుకు తగిన నిధులు కేటాయించకపోవడంతో.. రైతులతో పాటు మార్కెట్‌లోని కూలీలు, హమాలీలు, వ్యాపారులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కెట్ పాలకవర్గం గడువు ముగిసి ఏడాది పూర్తయినా, మార్కెట్ అనేక సమస్యలతో సతమతమవుతున్నా.. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు పాలకవర్గం నియామకంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. పత్తి, మిర్చి సీజన్లలో రైతులకు మద్దతుగా నిలవాల్సిన పాలకవర్గం ఏడాది నుంచి లేకపోవడంతో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.



వేరుశనగ యార్డులో అసంపూర్తిగా షెడ్డు నిర్మాణం

గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

పి.నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

ఎనుమాముల మార్కెట్ పరిధిలోని గుత్తేదారులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించిన చెక్కులు ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్నాయి. కొంతకాలంగా గుత్తేదారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. మార్కెటింగ్ శాఖ ఈఈ ద్వారా గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు



మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఈ వానాకాలం సీజన్‌లో రైతులు పండించే సన్నధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల ప్రకారం జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ యజమానులు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. మంగళవారం హనుమకొండలోని నక్కలగుట్ట ప్రాంతంలోని ఎమ్మెల్యే ఇంట్లో జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలు త్వరితగతిన ఇప్పించాలని కోరారు. మిల్లర్స్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నడిపెల్లి ప్రశాంత్‌రావు, ఉపాధ్యక్షుడు పెండెం రేపాల్, కోశాధికారి కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణి లాభాల్లో గందరగోళం

న్యూస్‌టుడే, భూపాలపల్లి

సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటాపై గందరగోళం నెలకొంది. మొత్తం లాభాల్లో వాటాను చెల్లించాలని ప్రతిపక్ష సంఘాలు డిమాండ్ చేస్తుండగా.. వాస్తవ లాభాల కంటే నికర లాభాలపైనే వాటాను పంపిణీ చేస్తారని అధికార సంఘాలు అంటున్నాయి. సింగరేణి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల లాభాలను పొందగా.. ఇందులో రూ.2,412 కోట్లపైనే కార్మికులకు 33 శాతం వాటాను ప్రకటించారు. మిగతా రూ.2,289 కోట్లను సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టినట్లు వెల్లడించారు. దీన్ని ప్రతిపక్ష సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మొత్తం లాభాలపై కార్మికులకు వాటా ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తున్నాయి. సింగరేణి చరిత్రలో ఇప్పటి వరకు ఇంత మొత్తం లాభాల వాటా చెల్లించింది లేదని అధికార పార్టీతో పాటు దాని అనుబంధ సంఘం చెబుతున్నాయి. ప్రతీసారి ఇదే విధంగా వాటాను చెల్లిస్తున్నారని.. కావాలని కొన్ని సంఘాలు రాద్ధాంతం చేస్తున్నాయని గుర్తింపు సంఘం విమర్శిస్తుంది.

నల్ల బ్యాడ్జీలతో నిరసనలు

సింగరేణి సంస్థ అభివృద్ధికి కేటాయించిన నిధులను సైతం కార్మికులకు వాటా పంచాలని ప్రతిపక్ష కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మూడు రోజులుగా పలు బొగ్గు గనుల ప్రాంతాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని ఏరియాల్లో సంతకాల సేకరణ చేపడుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో టీబీజీకేఎస్, ఇతర సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.



కేటీకే 5వ గని ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

భవిష్యత్తు ప్రణాళిక కోసం నిధులు పక్కకు..

భవిష్యత్తు ప్రణాళిక కోసం లాభాల్లోంచి రూ.2289 కోట్లలను పక్కన పెట్టినట్లు సింగరేణి వెల్లడించింది. వీటిని 1000 మెగావాట్ల సోలార్, 500 మెగావాట్ల హైడ్రో, 2,400 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించేందుకు వెచ్చించనున్నట్లు తెలిపింది. కొత్తగా ప్రారంభించనున్న వీకే ఓసీపీ, గోలేటీ ఓసీపీ, నైనీ ఓసీపీ, కొత్తగా సీహెచ్‌పీల నిర్మాణానికి ఈ నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని యాజమాన్యం వివరించింది. దీన్ని ప్రభుత్వం కూడా వెల్లడించింది.

లాభాల వాటాను సరిచేయాలి

- కంపేటి రాజయ్య, సీఐటీయూ కార్యదర్శి



సంస్థ సాధించిన లాభాలను పక్కదారి పట్టించేలా లెక్కలు చూపించారు. సంస్థ అభివృద్ధికి పెద్ద మొత్తాన్ని మినహాయించడం తగదు. కేవలం కొంత మొత్తాన్ని మాత్రమే కార్మికులకు పంచడం సరికాదు.

కార్మికులకు నష్టమే..

- బడితల సమ్మయ్య, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు



గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన సింగరేణి సంస్థ మొత్తం లాభాలు రూ.4,701 కోట్ల పైనే.. 33 శాతం లాభాల్లో వాటా ఇవ్వకుండా.. అభివృద్ధి పనుల పేరుతో ఎక్కువ శాతం నిధులను పక్కకు తీసి, వాటా లెక్కగట్టడం ముమ్మాటికీ కార్మికులకు నష్టం చేయడమే అవుతుంది. గతంలో ఎప్పుడు ఇలా జరగలేదు.

పారదర్శకంగానే వ్యవహరించింది

-కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి



సింగరేణి సంస్థ శ్రేయస్సు కోసం భవిష్యత్తులో చేపట్టబోయే నూతన గనుల తవ్వకాలు, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించే నిధులు వివరాలను యాజమాన్యం పారదర్శకంగా బహిర్గతం చేయడం వల్లనే కార్మికులు అపోహపడుతున్నారు. కార్మికులు అర్థం చేసుకోవాలి.

ప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు



గణపురం పీహెచ్‌సీలో సేవలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్

గణపురం, న్యూస్‌టుడే : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. మంగళవారం గణపురం పీహెచ్‌సీని సందర్శించి ఓపీతో పాటు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులతో ఓపీ సంఖ్య పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సేవలు అందించాలన్నారు. అనంతరం బుద్దారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు.

కలెక్టర్‌కు భూ నిర్వాసిత రైతుల మొర



కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతులు

కాటారం, న్యూస్‌టుడే : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోయిన తమకు నష్ట పరిహారం అందించాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మను కలిసి భూ నిర్వాసిత రైతులు మంగళవారం మొరపెట్టుకున్నారు. కొన్నేళ్లుగా భూములు కోల్పోయి పంటలు పండించక, పరిహారం రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం అందించే వరకు పనులు జరపొద్దని వేడుకున్నారు. భూములిచ్చేందుకు సిద్ధమేనని, పరిహారం అందించే వరకు పనులు జరపనివ్వబోమని స్పష్టం చేశారు. త్వరితగతిన పరిహారం అందించేలా చూడాలని కోరారు. కలెక్టర్ స్పందించి పరిహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని, పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రాజేందర్, వెంకటస్వామి, సత్యం, సంతోష్, బాపు, రామన్న, రాజమణి, మల్లమ్మ ఉన్నారు.

చెరువులను పరిరక్షించాలి : మండలంలోని చెరువులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని భాజపా నాయకులు మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందించారు. చెరువులను పూర్తిస్థాయిలో సర్వేచేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించి ఆక్రమణలు తొలగించాలని పేర్కొన్నారు. చిన్న కాళేశ్వరంలో భాగంగా అభివృద్ధి చేసే పలు చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నేత చల్లా నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు స్వామియాదవ్, అర్జయ్య పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే : చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరని వైద్యాధికారి శారద అన్నారు. మంగళవారం మోరంచపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన వైద్యాధికారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ప్రతి నెలా ఎత్తు, బరువు చూసుకోవాలన్నారు. సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజ, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, హైమా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మోరంచపల్లిలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిట్యాల : విద్యార్థులు మంచి పోషకాలున్న బలవర్ధక ఆహారం తీసుకోవాలని.. చిట్యాల ఎంపీడీవో రామకృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కర్ణాజీ అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11 నుంచి 18 ఏళ్ల వయసు బాలబాలికల్లో ఎదుగుదల కీలకమని, సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. చరవాణి వాడకం తగ్గించాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మీ, అరుణ, సంధ్యారాణి, జ్యోతి పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో 88 శాతం ఉత్తీర్ణత

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆగస్టులో వార్షిక పరీక్షలు నిర్వహించగా 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో వంద మంది విద్యార్థులకు 88 మంది ఉత్తీర్ణత సాధించగా 12 మంది ఫెయిల్ అయినట్లు అధ్యాపకులు తెలిపారు. 26 మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు అక్టోబర్‌లో సప్లిమెంటరీలో అవకాశం ఉంటుందని అధ్యాపకులు తెలిపారు.

ధర్మారావుపేటలో ఉచిత వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జీఎస్సార్

గణపురం, న్యూస్‌టుడే : ప్రజలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారావుపేటలో జీఎస్ రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరం ఏర్పాటుతో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కంటి పరీక్ష చేయించుకున్నారు. వైద్య శిబిరంలో సుమారు 250 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాటారం : స్థానిక మహాత్మా జ్యోతిరావు పులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వందన, సిబ్బంది సమ్మయ్య, శ్యామల, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నిరసన వ్యక్తం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : గత ఆర్థిక సంవత్సరంలో వాస్తవ లాభాలను ప్రకటించకుండా, నికర లాభాల్లో కేవలం తక్కువ మొత్తంలో ప్రభుత్వం కార్మికులకు లాభాల వాటా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలు ప్రకటించి, కార్మికులకు న్యాయం చేయాలని సమ్మయ్య డిమాండ్ చేశారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల అసమర్థత వల్లనే లాభాల వాటాలో కార్మికులు నష్టపోయారని పేర్కొన్నారు. నాయకులు సదానందం, దేవరకొండ మధు, కుమారస్వామి, మల్లారెడ్డి, రాంచందర్, శంకర్, నరేష్, నరేందర్, కిషన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవా రంగాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలునాయక్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భావిభారత పౌరులైన విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా రంగాల్లో ముందుండాలని భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.బాలునాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని కళాశాల ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలునాయక్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ పట్టుదలతో లక్ష్యాన్ని ఎంచుకుని విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్, అధ్యాపకులు సదానందం, రాజు, నరేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

మహదేవపూర్ : విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని, సమాజహితమైన సేవలను చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సామాజిక కార్యక్రమాలు, లక్ష్యాలు, విద్యార్థుల సేవా దృక్పథంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్, ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పరశురాములు, జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారి రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్యాల : విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కర్ణాజీ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రోగ్రాం అధికారి యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ చొరవతోనే సమస్యల పరిష్కారం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : సింగరేణి కార్మికులకు ఆరోగ్యపరమైన అంశాలు, ఇతర సంక్షేమ పథకాల అమలు, తదితర సమస్యలు ఐఎన్‌టీయూసీ చొరవతోనే పరిష్కారానికి నోచుకుంటున్నాయని సంఘం భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య తెలిపారు. మంగళవారం కేటీకే 5వ గని ఆవరణలో ద్వార సమావేశం నిర్వహించారు. బుచ్చయ్య మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన లాభాల్లో 33 శాతం కార్మికులకు ఇప్పించిన ఘనత ఐఎన్‌టీయూసీకే దక్కుతుందన్నారు. సింగరేణికే బొగ్గు బ్లాక్‌లను కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణకు పాల్పడుతోందని ఆరోపించారు. రాబోయే కొద్దిరోజుల్లో దీపావళి బోనస్ చెల్లించడానికి యాజమాన్యంపై ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు పసునూటి రాజేందర్, రాజేష్ ఠాగూర్, వేణుగోపాల్, రాంబాబు, నాగరాజు, కిరణ్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ



ప్రారంభిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాళేశ్వరం : నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మహదేవపూర్ ఎస్సై రాంచందర్‌రావు, కాళేశ్వరం ఎస్సై చక్రపాణితో కలిసి పూస్కుపల్లిలో పలు నిఘా నేత్రాలను ప్రారంభించారు. కాళేశ్వరం పోలీసుల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు.

పంటల సాగులో మెలకువలు తప్పనిసరి



వరి పంటను పరిశీలిస్తున్న డీఏవో విజయభాస్కర్

చిట్యాల, న్యూస్‌టుడే : మిరప సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఎన్ఎస్ఎస్‌పీ మాస్టర్ ట్రైనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోతన ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్‌పీ కొచ్చిన్ ద్వారా మండలంలోని మిరప రైతులకు చిట్యాల రైతు వేదికలో పంట సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐపీఎం పద్ధతులు, సేంద్రియ సాగు విధానంపై అవగాహన కల్పించారు. పంట కోతల విధానం, మార్కెటింగ్ పద్ధతులపై శిక్షణ అందించారు. పెట్టుబడి తగ్గించుకోవడం, అధిక ఉత్పత్తిని పెంచేందుకు తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, పోతన సొసైటీ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, ఓరుగల్లు ఎఫ్‌పీవో ఎండీ సత్యనారాయణరెడ్డి, ఉద్యాన అధికారి సునీల్, ఏఈవోలు సన్నీ, రమణకుమార్, సందీప్ పాల్గొన్నారు.

మల్హర్ : పెద్దతూండ్ల క్లస్టర్ పరిధిలో దుబ్బపేటలో మంగళవారం ఏఈవో శిరీష, వల్లెంకుంటలో ఏఈవో అనూష వరి పంటలను పరిశీలించారు. పంటకు సోకుతున్న కాండం కుళ్లు తెగులుపై అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్లను అరికట్టవచ్చని సూచించారు.

గణపురం : ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల నేపథ్యంలో పంటల సంరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విజయభాస్కర్ అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో వరి, పత్తి పంటల క్షేత్ర పరిశీలన చేశారు. రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి చేనులో నీరు నిల్వ లేకుండా కాలువలు తీసి బయటకు పంపించాలని సూచించారు. ఎకరానికి 20 కిలోల చొప్పున యూరియా, పొటాష్ ఎరువులు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, ఏవో అయిలయ్య, ఏఈవోలు మౌనిక, కల్యాణ్ పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్దఎత్తున కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.నారాయణ బాబు ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు ద్వేషభావాలను తగ్గించుకొని, రాజీ మార్గాన్ని అలవాటు చేసుకోవాలని, చిన్న సమస్యలు పెద్దవిగా చేసుకొని, పంతాలకు పోయి, కేసుల్లో చిక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని న్యాయమూర్తి తెలిపారు. వివిధ కేసుల్లో చిక్కుకున్న కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు.

నదుల ప్రాముఖ్యంపై ర్యాలీ



మొట్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : ప్రపంచ నదుల దినోత్సవం పురస్కరించుకొని మొట్లపల్లి ఎన్‌సీసీ అధికారి, ప్రధానోపాధ్యాయుడు లింగాల కుమారస్వామి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామ శివారులోని వాగు పరిసరాల్లో నెలకొన్న చెత్త, చెదారాన్ని, గాజు పెంకులు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేస్తూ వీధుల్లో ప్రపంచ నదుల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. నదుల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి సుజాత, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్‌కుమార్, వీరయ్య పాల్గొన్నారు.

మల్హర్ : మల్లారం పంచాయతీలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో రహదారులకు ఇరువైపులా ముళ్ల చెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ క్రీడలో తలపడుతున్న విద్యార్థులు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కన్వీనర్ గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ పాఠశాల క్రీడా పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, శ్రావణి, శ్రీనివాస్, అజయ్, కార్తీక్ పాల్గొన్నారు.

డీవైఎస్‌ఓకు సన్మానం



భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా యువజన, క్రీడల అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లావుడ్యా జయపాల్‌ను మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా జయపాల్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జాగిరి అజయ్, ఎస్‌జీఎఫ్ క్రీడల జిల్లా కార్యదర్శి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రత్యేకాధికారి బాధ్యతల స్వీకరణ



రేగొండ, న్యూస్‌టుడే : మండల ప్రత్యేక అధికారిగా సీపీవో బాబురావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆ స్థానంలో విధులు నిర్వహించిన సామ్యూల్ వేరే జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో బాబురావు వచ్చారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాంప్రసాద్, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ ఉన్నారు.

నేడు రాజరాం వర్ధంతి సభ

మల్హర్, న్యూస్‌టుడే : అంబేడ్కర్ యువజన సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత, దివంగత బోగే రాజరాం వర్ధంతి కార్యక్రమానికి భారీగా తరలిరావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పసుల పోచయ్య, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ కేంద్రమైన మంథనిలో బుధవారం జరిగే సభలో దళిత, బహుజనవాదులు, విద్యావేత్తలు పాల్గొనాలని కోరారు.

27న యోగా టీచర్ పోస్టులకు ముఖాముఖి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు ప్రాంతీయ ఆయుష్ శాఖ ఆర్‌డీడీ ప్రమీలాదేవి, ఆయుష్ జిల్లా ఇన్‌ఛార్జి డా.మైదం రాజు తెలిపారు. యోగా టీచర్ల నియామకానికి ఈ నెల 27న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆయుష్‌శాఖ ఆర్‌డీడీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రేపు మహా ధర్నా

భూపాలపల్లి, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, ఈ నెల 26న హైదరాబాద్‌లోని విద్యుత్తు శాఖ ముఖ్య కార్యాలయంలో జరిగే మహాధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని విద్యుత్తు శాఖ జేఏసీ జిల్లా ఛైర్మన్ టి.రాజు, కన్వీనర్ మోత్కూరి కోటి ఒక ప్రకటనలో కోరారు. 20 ఏళ్లుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంటు చేస్తూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ పరీక్ష ఫీజుకు తత్కాల్ అవకాశం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లాలో సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా విద్యను అభ్యసిస్తున్న అభ్యర్థులు ప్రభుత్వం కల్పించిన తత్కాల్ పథకాన్ని ఉపయోగించుకోవాలని, ఈ నెల 26వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అభ్యర్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు తత్కాల్ ఫీజు రూ.500, ఇంటర్ అభ్యర్థులు రూ.1000 చెల్లించాలని పేర్కొన్నారు. అక్టోబరు 3వ తేదీ నుంచి పరీక్షలు ఉంటాయని, ఈ నెల 30వ తేదీన అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.